క్లుప్తంగా

గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

పమిడిముక్కల: గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని మండల నోడల్ అధికారి ఎం.ఫణిధూర్జటి పేర్కొన్నారు. మండలంలోని మర్రివాడ గ్రామంలో శుక్రవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. వివిధ సమస్యలపై ప్రజలు 12 అర్జీలను అధికారులకు అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ నవీన్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వంపుగడవల ప్రాన్సిస్, మండల సర్వేయర్ సుధీర్‌కుమార్, రీసర్వే డీటీ యేసుపాదం, వీఆర్వో హేమ పాల్గొన్నారు.

రైతులను ఇబ్బంది పెట్టొద్దు

పామర్రు: ధాన్యం కొనుగోలులో రైతులను ఇబ్బంది పెట్టవద్దని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. స్థానిక మార్కెట్ యార్డులోని రైతు సేవా కేంద్రాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దళారుల మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. పండించిన ధాన్యాన్ని ఆర్‌ఎస్‌కేల ద్వారా ఇష్టమైన మిల్లర్లకు తోలించాలన్నారు. ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు రైతులు అమ్ముకునే విధంగా అధికారులు అవకాశాన్ని కల్పించాలన్నారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

కొండిపర్రు(పామర్రు): గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం ప్రారంభించినట్లు కొండిపర్రు గ్రామ పార్టీ కన్వీనర్ నూకారపు వీరాంజనేయులు పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ కాలనీలోని 120 మీటర్ల రహదారిని సుమారు రూ.9 లక్షలతో ఏర్పాటు నిర్మించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానికులు పసుపులేటి విజయ్ కుమార్, సువర్ణరాజు, సాంబ, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్ రామకృష్ణ పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు

ఎలకుర్రు(పామర్రు): రెవెన్యూ సదస్సులను ప్రజలందరూ సద్వినియోగం చేసుకుని లబ్ధి పొందాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. మండలంలోని ఎలకుర్రు, ప్రాకర్ల గ్రామాల్లో రెవెన్యూ సభలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో పరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సును నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పంట భూములు, ఇళ్ల స్థలాలకు సంబంధించి ఏమైనా సమస్యలు ఉన్నా సంబంధిత వ్యక్తులు సదస్సులో దరఖాస్తు చేసుకుని పరిష్కారం పొందవచ్చన్నారు. గ్రామ సర్పంచ్ శివ మస్తాన్‌రావు, తహసీల్దార్ రవి కాంత్, ఎంపీడీఓ జ్యోతి, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు రత్నకుమారి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి

గుడ్లవల్లేరు: తుపానుకు దెబ్బ తిన్న రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయటం లేదని జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ ఎదుట వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ కుటుంబరావు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం చంద్రాలలో ప్రారంభించిన రెవెన్యూ సదస్సులకు విచ్చేసిన జేసీకి ధాన్యం కొనుగోళ్లలో రైతుల కష్టాలను కుటుంబరావు విన్నవించారు. ధాన్యం కొనుగోలు చేయమంటే రైస్ మిల్లర్లు ససేమిరా అంటున్నారని ఆయన వాపోయారు. బ్యాంకు గ్యారంటీ లేకుండా ధాన్యం కొనుగోళ్లను చేయలేరని జేసీ సమాధానమిచ్చారు. స్థానిక రైతుల నుంచి వచ్చే ధాన్యాన్ని తప్పనిసరిగా కొనుగోలు చేయాలని కొనుగోలు కేంద్రాల సిబ్బందిని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము ఆదేశించారు.

35 మద్యం సీసాల స్వాధీనం

కైకలూరు: జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ టాస్క్‌ఫోర్సు అధికారులు నియోజకవర్గం నాలుగు మండలాల్లో బెల్టు షాపులపై శుక్రవారం దాడులు నిర్వహించారు. ముదినేపల్లి మండలం కొత్తపల్లికి చెందిన ఆరేపల్లి కృష్ణ, మండవల్లి మండలం కొవ్వాడలంక గ్రామానికి చెందిన జయమంగళ రాఘవేంద్రరావు, ఇదే మండలం ఇంగిలిపాకలంక గ్రామానికి చెందిన వెంకట శ్రీకాంత్ నుంచి మొత్తం 35 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. ఎస్ఐలు ఆదినారాయణ, అలీం, కానిస్టేబుల్ భాస్కరరెడ్డి పాల్గొన్నారు.

అన్నదాతకు కష్టాలు

- వర్షాలకు తడిసిన ధాన్యం
- రెట్టింపు ఖర్చులతో ధాన్యాన్ని గట్టుకు చేర్చుకుంటున్న రైతులు



కౌతవరంలో తడిసిన ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు (ఇన్‌సెట్లో) గుడ్లవల్లేరులో ఆరబెట్టిన ధాన్యంలో మానుగాయను వేరు చేస్తున్న మహిళా రైతులు

గుడ్లవల్లేరు: గుడ్లవల్లేరు మండలంలో ఇటీవల తుపాను ప్రభావంతో కురిసిన వర్షాలతో వరి కంకులు తడవడంతో పాటు ధాన్యానికి మొలకలు వచ్చాయి. కోతకొచ్చిన పొలాలు పడకేయటంతో ఆ వరి చేలపై రోజులు తరబడి కురిసిన వర్షంతో పంట పనికి రాకుండా పోయిందని బాధిత రైతులు వాపోతున్నారు. ఆరుగాలం కంటికి రెప్పలా కాపాడిన పంట చేతికి రాకుండా పోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పడకేసిన పొలాలను లేపి కూలీలతో కోయించటంతో కోతకే ఎకరానికి రూ.20వేలు అవుతుందని వాపోతున్నారు. వర్షాలకు ముందు మామూలుగా కూలీలతో పంట కోయిస్తే ఎకరానికి రూ.10వేల కంటే ఎక్కువ అయ్యేది కాదని అంటున్నారు. ఈ వాతావరణ పరిస్థితుల కారణంగా కూలీలు కూడా వర్షంలో కోసేందుకు ససేమిరా అంటున్నారని చెబుతున్నారు.

సగం ధాన్యం వర్షం పాలు



వర్షాలకు మా చేలో వరి కోతకొచ్చి పడకేసింది. దానిని పైకి లేపి కోయించేందుకు 40 మందిని కూలీలు ఏర్పాటు చేశా. కూలీలకే ఎకరానికి రూ.20 వేలు ఖర్చయింది. అసలు ఎకరానికి రూ.10 వేలతో కోత కోయించేయవచ్చు. ఈ వర్షాల కారణంగా ఖర్చు రెట్టింపు అయ్యింది. అయినా కోసేటపుడు సగం ధాన్యం వర్షం నీటిలోనే కలిసిపోయింది.

– పామర్తి వెంకటేశ్వరరావు, రైతు, కౌతవరం, గుడ్లవల్లేరు మండలం

రైతులను చిన్నచూపు చూడొద్దు



వర్షాల బారిన పంటను కాపాడుకునేందుకు ఒక రకంగా ప్రతికూల వాతావరణంతో రైతులు యుద్ధం చేశారు. రైతులను ప్రభుత్వం చిన్నచూపు చూడొద్దు. అలా చేస్తే.. రాబోయే కాలంలో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. ఇప్పటికే మిల్లర్లు ధాన్యం కొనుగోలు చేయక అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. మద్దతు ధర కల్పించాలి.

– చేబత్తిన నందేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు

సమ సమాజ స్థాపనకు అంబేడ్కర్ కృషి



పామర్రులో అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యురాలు తదితరులు



పామర్రులో అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా



చంద్రాలలో అంబేడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే రాము



గోపవరంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే కామినేని



గుడ్లవల్లేరులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన నాయకులు



గుడివాడ వైఎస్సార్ సీపీ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న నాయకులు

పామర్రు: అసమానతలు లేని సమ సమాజ స్థాపన కోసం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కృషి చేశారని ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్, జెడ్పీటీసీ సభ్యురాలు కె.స్వరూపరాణి పేర్కొన్నారు. అంబేడ్కర్ వర్ధంతిని పామర్రులోని మాజీ ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. తొలుత ఆయన చిత్ర పటానికి, స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వైస్ ఎంపీపీలు ఆరేపల్లి శ్రీనివాసరావు, అరుమళ్ల రమాదేవి, ఎంపీటీసీ సభ్యులు శ్రీనివాసరావు, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. స్థానిక నాలుగురోడ్ల కూడలి వద్ద అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే కుమార్‌రాజా పూలమాల వేసి నివాళులర్పించారు.

గుడ్లవల్లేరులో..

గుడ్లవల్లేరు: మండలంలోని చంద్రాల, గుడ్లవల్లేరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చంద్రాలలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, రాష్ట్ర గిడ్డంగుల చైర్మన్ రావి వెంకటేశ్వరరావు నివాళులర్పించారు. ఆర్డీఓ బాల సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ బి.లోకరాజు, ఎంపీడీఓ విజయసారథి, సర్పంచ్ అర్జునరావు పాల్గొన్నారు. గుడ్లవల్లేరులో అంబేడ్కర్ విగ్రహానికి వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు నాగు, గుడివాడ నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు చేబత్తిన నందేశ్వరరావు నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ నాయకులు పెనుమాల రంగారావు, రాజు, వెంకటేశ్వరరావు, దళిత నాయకులు పాపారావు, నిరంజనరావు తదితరులు పాల్గొన్నారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: అంబేడ్కర్ వర్ధంతిని శుక్రవారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండలి హనుమంతరావు కార్యాలయంలో పార్టీ నాయకులు అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం జరిపారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాల, వేసి నివాళులర్పించారు. నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం, వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి ఎంవీ నారాయణరెడ్డి, నాయకులు కె.ఆంజనేయ ప్రసాదు, శేఖర్, సైమన్, ఎలీషా, యెషయ్య, తాళ్లూరి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ఏలూరు రోడ్‌లోని టీడీపీ కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి నిర్వహించారు. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

మండవల్లిలో..

మండవల్లి: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా మండవల్లి సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి శుక్రవారం పలువురు నివాళులర్పించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అసోసియేషన్ మండవల్లి అధ్యక్షుడు కె.శాంతరాజు, గౌరవాధ్యక్షుడు ఎల్ఎస్ భాస్కరరావు, నాయకులు అభిష తదితరులు పాల్గొన్నారు.

గోపవరంలో..

కైకలూరు: రాజ్యాంగ రూపకల్పనలో డాక్టర్ అంబేడ్కర్ చేసిన కృషి జాతి ఎన్నటికీ మరువదని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ చెప్పారు. గోపవరంలో అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్సీ విఠల్‌రావు, కూటమి నేతలు సుధా, రమేష్, సుధీర్ పాల్గొన్నారు.

ముదినేపల్లి రూరల్: అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం శుక్రవారం ముదినేపల్లిలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద నిర్వహించారు. ఈ విగ్రహానికి వైఎస్సార్ సీపీ నాయకుడు నిమ్మగడ్డ భిక్షాలు నివాళులర్పించారు. బేతపూడి వెంకటరమణ, భూపతి రవీంద్ర, మోట్రు ఏసుబాబు, ఎం ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వంట షెడ్డుకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్



వంట షెడ్డుకు ప్లాస్టింగ్ చేస్తున్న తాపీ పనివారు

గుడ్లవల్లేరు: స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల–2లో వంట షెడ్డుకు ప్లాస్టింగ్ పనులను చేపట్టారు. గత నెల 27వ తేదీన 'మధ్యాహ్న భోజనానికి ధరల మంట' అనే శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. ఆ కథనానికి స్పందించిన అధికారులు పాఠశాల ప్రాంగణంలోని వంట షెడ్డుకు శుక్రవారం మరమ్మతులు చేపట్టారు.

పారిశుద్ధ్యం మెరుగు పరిచేందుకు సహకరించాలి

గుడివాడ టౌన్: పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగుపరిచేందుకు పురపాలక సంఘ అధికారులు చేస్తున్న కృషికి ప్రజల సహకారం కూడా తోడవ్వాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శుక్రవారం ఆయన పట్టణంలోని టైలరింగ్ స్ట్రీట్, పోస్టాఫీస్ రోడ్, ఏలూరు రోడ్, బస్టాండ్ తదితర ప్రాంతాల్లో ద్విచక్ర వాహనంపై పర్యటించారు. టైలరింగ్ స్ట్రీట్‌లో భారీగా చెత్త పేరుకుపోవడాన్ని కమిషనర్ దృష్టికి తీసుకొచ్చి ఇలా రోడ్లపై చెత్త వేసే వారికి జరిమానా విధించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. శ్రీనివాసరావు, శానిటరీ ఉద్యోగులు పాల్గొన్నారు.

మద్దతు ధర లభించేలా చర్యలు



గోపువానిపాలెంలో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ బాలాజీ

పమిడిముక్కల: ధాన్యం కొనుగోలులో రైతుల సమస్యలు పరిష్కరించడంతోపాటు మద్దతు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గోపువానిపాలెంలో రైతు సేవా కేంద్రాన్ని శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. ధాన్యం విక్రయంలో రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మద్దతు ధర రావడం లేదని, ధాన్యం తరలింపులో ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. తహసీల్దార్ నవీన్‌కుమార్, ఏఓ గణేష్‌రెడ్డి, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ సుబ్బారాయుడి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా స్వామి, అమ్మవార్లను వధూ వరులుగా ప్రధాన అర్చకుడు తోలేటి వీరభద్రశర్మ ముస్తాబు చేశారు. తొలుత స్వామికి సహాయ కమిషనర్ ఆర్.గంగా శ్రీదేవి, ఉత్సవ కమిటీ సభ్యులు ఉత్సవ కార్యక్రమాలను ప్రారంభించారు. స్వామి, అమ్మవార్లకు మార్గశిర శుద్ధ షష్ఠి సందర్భంగా శనివారం రాత్రి స్వామి, అమ్మవార్ల దివ్య కల్యాణోత్సవం నిర్వహిస్తామని సహాయ కమిషనర్ తెలిపారు. పాల్గొనే దంపతులు రూ.1,516 చెల్లించాలన్నారు.

■ ఉత్సవ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారం

ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ వార్షిక కల్యాణోత్సవాలకు ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ సహాయ కమిషనర్ ఆర్.గంగాశ్రీదేవి ఆధ్వర్యంలో 10 మంది సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

జాగ్రత్తగా విధులు నిర్వహించాలి

ముదినేపల్లి రూరల్: ఉత్సవాల సమయంలో అప్రమత్తంగా ఉంటూ సమర్థవంతంగా విధులు నిర్వహించాలని కైకలూరు రూరల్ సీఐ వి.రవికుమార్ పోలీసు సిబ్బందికి సూచించారు. సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్‌లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ షష్ఠి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

■ బీజామృతంతో విత్తనశుద్ధి

ముదినేపల్లి రూరల్: మినుము విత్తనాలను బీజామృతంతో శుద్ధి చేస్తే ప్రయోజనాలు చేకూరుతాయని ప్రకృతి వ్యవసాయ మండల ఇన్‌చార్జి గౌతమ్‌కుమార్ అన్నారు. మండలంలోని సింగరాయపాలెంలో ప్రకృతి వ్యవసాయ విధానం, బీజామృతం తయారీ గురించి రైతులకు శుక్రవారం వివరించారు. బీజామృతంతో విత్తనశుద్ధి వల్ల మొలకశాతం పెరగడంతోపాటు పైరులో పలురకాల తెగుళ్ల నివారణకు దోహదపడుతుందన్నారు.

■ పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతే ధ్యేయం

పామర్రు: పాల ఉత్పత్తిదారుల అభ్యున్నతే ధ్యేయంగా కృష్ణామిల్క్ యూనియన్ పని చేస్తోందని పాల శీతల కేంద్రం మేనేజర్ దామోదరం కృష్ణ గోపినాథ్ పేర్కొన్నారు. స్థానిక చిన్న పాల సేకరణ కేంద్రంలో సంఘ అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డితో కలిసి పాడి రైతులకు అదనపు బోనస్ శుక్రవారం పంపిణీ చేశారు. రూట్ సూపర్‌వైజర్ రమేష్‌బాబు, వేతన కార్యదర్శి శ్రీహరి పాల్గొన్నారు.

■ శాలరీ సర్టిఫికెట్ తప్పనిసరి

ముదినేపల్లి రూరల్: వీఆర్‌ఏలు జీతాలు పొందడానికి శాలరీ సర్టిఫికెట్ తప్పనిసరి అని మండల గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం అధ్యక్షుడు కె.కిషోర్ అన్నారు. ముదినేపల్లిలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ శాలరీ సర్టిఫికెట్ పొందడంపై వీఆర్‌ఏల్లో అపోహలు నెలకొనడం తగదన్నారు.

■ ఇంటి నిర్మాణాలకు దరఖాస్తు చేసుకోండి

కైకలూరు: నియోజకవర్గంలో స్థలాలు కలిగి, ఇంటి నిర్మాణాలు చేయని లబ్ధిదారులు ప్రధానమంత్రి ఆవాజ్ యోజన–అర్బన్ 2.0లో భాగంగా దరఖాస్తు చేసుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. దరఖాస్తులను గృహ నిర్మాణశాఖ ఏఈ, డీఈలకు అందించాలని పేర్కొన్నారు.

■ అంగన్‌వాడీ కేంద్రాల్లో సౌకర్యాలు కల్పిస్తాం

కైకలూరు: నియోజకవర్గంలో అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలను కల్పిస్తామని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ తెలిపారు. గోపవరంలో నూతనంగా నిర్మించిన అంగన్‌వాడీ భవనాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం నిర్మాణానికి సహకరించిన సత్యనారాయణరాజును సన్మానించారు.

■ షష్ఠి మహోత్సవాల్లో అఖండ దీపారాధన

కలిదిండి (కైకలూరు): అతిపురాతనమైన పెదలంక పార్వతీ సమేత నాగేశ్వరస్వామి, వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి షష్ఠి మహోత్సవాలు వైభవోపేతంగా శుక్రవారం ప్రారంభమయ్యాయి. మొదటి రోజు అడవి రామదాసు దంపతులు అఖండ దీపారాధన, అష్టోత్తరనామ పూజలు చేశారు. ఆలయ ఈఓ వీఎన్‌కే శేఖర్ మాట్లాడుతూ షష్ఠి మహోత్సవాలు ఈ నెల 15వ తేదీ వరకు నిర్వహిస్తారన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులు ముద్దం బుల్లి వెంకయ్య, నాగు, రామకృష్ణ, రంగబాబు, సూరిబాబు పాల్గొన్నారు.

■ రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

పామర్రు(తోట్లవల్లూరు): రైతుల సమస్యలను పరిష్కరిస్తామని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెంలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ధాన్యం అమ్మకాల్లో సమస్యల పరిష్కారం కోసం తగు చర్యలు తీసుకుంటామన్నారు.

■ సమస్యల పరిష్కారం కోసమే సదస్సులు

భూషణగుళ్ళ(పెదపారుపూడి): గ్రామాల్లో ఉన్న భూసమస్యల పరిష్కరం కోసమే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వై. రంగరావు తెలిపారు. మండలంలోని భూషణగుళ్ల సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ రెవెన్యూ సదస్సు నిర్వహించారు.

గుడివాడలో..

గుడివాడ టౌన్: ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య ఉన్న సమస్యల పరిష్కారానికి గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రామకోటేశ్వరరావు తెలిపారు. శుక్రవారం రూరల్ మండలం సీపూడిలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఆర్ఐ నాగబాబు, డీటీ రామశివ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

■ వల్లూరుపాలెం వీఏఏ సస్పెన్షన్

పామర్రు(తోట్లవల్లూరు): ధాన్యం కొనుగోళ్ల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన తోట్లవల్లూరు మండలం వల్లూరుపాలెం వీఏఏ ఆయేషాను సస్పెండ్ చేసినట్లు ఏఓ నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రైతు సేవా కేంద్రంలో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకురాలిని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సస్పెండ్ చేశారని పేర్కొన్నారు.

■ మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

గుడివాడ టౌన్: యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని రూరల్ ఎస్ఐ చంటిబాబు అన్నారు. శుక్రవారం రూరల్ మండలం వలివర్తిపాడులోని న్యూవిజన్ హైస్కూల్లో 'డ్రగ్స్ వద్దు బ్రో' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి ఎస్ఐ మాట్లాడుతూ యువత వారికి తెలియకుండానే ఈ ఉచ్చులో పడిపోతారన్నారు. ఎవరు ప్రేరేపించినా వాటి జోలికి వెళ్లవద్దని సూచించారు.

■ 90 మందికి ఉద్యోగావకాశాలు

మొవ్వ: స్థానిక వేమూరి సుందర రామయ్య ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల్లో శుక్రవారం నిర్వహించిన జాబ్ మేళా ద్వారా 90 మందికి ఉద్యోగావకాశాలు కల్పించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ మాధవి తెలిపారు. కళాశాల్లోని జవహర్ నాలెడ్జ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మేళాలో ఐసీఐసీఐ బ్యాంకు, నిట్ తదితర సంస్థల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికైన అభ్యర్థులకు నియామక పత్రాలను అందజేశారు. సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, తహసీల్దార్ మస్తాన్ పాల్గొన్నారు.

■ నేడు పాఠశాలల్లో సమావేశాలు

ముదినేపల్లి రూరల్: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశాలు శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు పాఠశాలలను సమావేశాలకు ముస్తాబు చేస్తున్నారు. ఎంఈఓ కె.నరేష్‌కుమార్ మాట్లాడుతూ పండగ వాతావరణంలో ఆత్మీయ సమావేశాల వలే నిర్వహించాలన్నారు.